# సాత్విక్ జోడీ ముందంజ

కౌలాలంపూర్: భారత బ్యాడ్మింటన్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి మలేషియా ఓపెన్‌లో క్వార్టర్స్‌కు చేరుకుంది. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో భారత ద్వయం 21-15, 21-15తో మలేషియాకే చెందిన అజిన్ అయూబ్-టాన్ వి కియోంగ్‌ను ఓడించింది. వరుస గేమ్‌లను గెలుచుకున్న భారత షట్లర్లు.. 43 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించారు. సాత్విక్-చిరాగ్ మినహా మిగిలిన భారత షట్లర్లు ప్రిక్వార్టర్స్‌లోనే ఇంటిబాట పట్టారు. హెచ్ఎస్ ప్రణయ్, మాళవిక బన్సోద్, క్రాస్టో-ధ్రువ్ జోడీ రౌండ్ ఆఫ్-16లోనే నిష్క్రమించింది.

# క్వార్టర్స్‌కు రాజస్థాన్, హర్యానా

- విజయ్ హజారే ట్రోఫీ

వడోదర: దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో రాజస్థాన్, హర్యానా క్వార్టర్స్ బెర్తును ఖాయం చేసుకున్నాయి. గురువారం వడోదరలో తమిళనాడుతో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్.. 19 పరుగుల తేడాతో గెలిచింది. రాజస్థాన్ ఓపెనర్ అభిజీత్ తోమర్ (111) శతకంతో కదం తొక్కగా కెప్టెన్ లోమ్రర్ (60) రాణించడంతో ఆ జట్టు 47.3 ఓవర్లలో 267 పరుగులు చేసింది. తమిళనాడు మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి (5/52) ఐదు వికెట్లతో మెరిశాడు. కానీ ఛేదనలో తమిళనాడు 47.1 ఓవర్లలో 248 పరుగులకే చేతులెత్తేసింది. మరో మ్యాచ్‌లో హర్యానా.. 72 పరుగుల తేడాతో బెంగాల్‌ను చిత్తు చేసింది. మొదట బ్యాటింగ్ చేసిన హర్యానా.. నిర్ణీత ఓవర్లలో 298/9 పరుగులు చేసింది. బెంగాల్ తరఫున ఆడుతున్న టీమ్‌ఇండియా స్టార్ పేసర్ మహ్మద్ షమీ (3/61) మూడు వికెట్లు పడగొట్టాడు. కానీ బెంగాల్ 226 పరుగులకే కుప్పకూలింది. క్వార్టర్స్‌లో హర్యానా.. గుజరాత్‌తో తలపడనుండగా, రాజస్థాన్ విదర్భతో తలపడనుంది.

# మనీశ్‌పాండే, అశ్రిత దూరం దూరం!

బెంగళూరు: టీమ్‌ఇండియా క్రికెటర్ల వైవాహిక జీవితం ఒడిదొడుకుల పయనంగా సాగుతున్నది. ఇప్పటికే స్టార్ క్రికెటర్ హార్దిక్ పాండ్యా తన భార్య నటాషా స్టాన్కోవిచ్‌తో తెగదెంపులు జరుగగా, యజువేంద్ర చాహల్, ధనశ్రీ మధ్య విబేధాలు పొడచూపగా, తాజాగా మరో జంట ఈ జాబితాలో చేరింది. మనీశ్‌పాండే, అశ్రిత శెట్టి విడాకులు తీసుకోబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఒకరికొకరు సోషల్‌మీడియా ఇన్‌స్టాగ్రామ్‌లో అన్‌ఫాలో చేసుకోవడం దీనికి మరింత బలాన్ని చేకూరుస్తున్నది. 2019 డిసెంబర్ 2 ఒక్కటైన మనీశ్, అశ్రిత గత కొన్ని రోజులుగా విడివిడిగా ఉంటున్నారు. అశ్రిత తన సోషల్‌మీడియాలో మనీశ్ ఫొటోలు తీసేయగా, మనీశ్ కూడా అదే పని చేస్తూ అన్‌ఫాలో చేశాడు. టీమ్‌ఇండియా తరఫున 29వన్డేలు, 39 టీ20లు ఆడిన మనీశ్ ఫామ్‌లేమితో సతమతమవుతున్నాడు. ఇటీవల జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో ఐదు మ్యాచ్‌లు ఆడి 117 పరుగులకే పరిమితమయ్యాడు.

# కావచ్చు..కాకపోవచ్చు

విడాకులపై స్పందించిన చాహల్

న్యూఢిల్లీ: టీమ్‌ఇండియా క్రికెటర్ యజువేంద్ర చాహల్..తన భార్య ధనశ్రీవర్మతో విడాకులపై వస్తున్న వార్తలపై ఎట్టకేలకు స్పందించాడు. గురువారం తన ఇన్‌స్టాగ్రామ్‌లో రాసుకొస్తూ విడాకులు కావచ్చు..కాకపోవచ్చు అంటూ పేర్కొన్నాడు. 'మీ మద్దతు లేకుండా నేను ఇప్పుడు ఈ స్థాయిలో ఉండే వాడిని కాదు. క్లిష్ట సమయాల్లో మీరు నా పట్ల చూపించిన అభిమానం మరువలేనిది. దేశం కోసం, జట్టు కోసం, అభిమానుల కోసం ఇంకా ఆడుతాను. ప్లేయర్‌గా గర్వపడుతున్నాను. ఇటీవల నా వ్యక్తిగత విషయాలపై సోషల్‌మీడియాలో రకరకాలుగా పోస్టులు వచ్చాయి. అవి నిజం కావచ్చు, కాకపోవచ్చు. మా కుటుంబ విషయాల్లో కలుగజేసుకోవద్దని మిమ్మల్నికోరుకుంటున్నాను' అని వివరించాడు.

## నాగల్‌కు కఠిన డ్రా

- ఆస్ట్రేలియా ఓపెన్

మెల్‌బోర్న్: ప్రతిష్టాత్మక ఆస్ట్రేలియా ఓపెన్‌లో భారత టెన్నిస్ ఆటగాడు సుమిత్ నాగల్‌కు తొలి రౌండ్‌లోనే కఠిన ప్రత్యర్థి ఎదురయ్యాడు. గురువారం వెలువడిన మెయిన్ డ్రాలో భాగంగా మొదటి రౌండ్‌లో నాగల్.. ప్రపంచ 26వ నంబర్ ఆటగాడు థామస్ మకాచ్ (చెక్ రిపబ్లిక్)తో తలపడనున్నాడు. గత సీజన్ షాంఘై మాస్టర్స్‌లో ప్రపంచ రెండో నంబర్ ఆటగాడు కార్లోస్ అల్కారజ్‌ను థామస్ ఓడించాడు. ఇక ప్రస్తుతం ఏటీపీ ర్యాంకింగ్స్‌లో 96వ స్థానంలో ఉన్న నాగల్ గతేడాది ఈ టోర్నీలో రెండో రౌండ్‌కు చేరగా ఈ సీజన్‌లో మరోసారి సత్తా చాటాలని భావిస్తున్నాడు. ఇక ఈ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్లు అయిన జన్నిక్ సిన్నర్, అరీనా సబలెంక, మాజీ చాంపియన్ నొవాక్ జొకోవిచ్‌కు తొలి రౌండ్‌లో సులువైన ప్రత్యర్థులు ఎదురయ్యారు.

## సెమీస్‌కు బాంబ్రీ జోడీ

ఆక్లాండ్: భారత టెన్నిస్ ఆటగాడు యూకీ బాంబ్రీ, ఫ్రాన్స్ సహచరుడు అల్బనో ఒలివెట్టి ద్వయం ఆక్లాండ్‌లో జరుగుతున్న ఏఎస్‌బీ క్లాసిక్ టోర్నీలో సెమీఫైనల్‌లోకి ప్రవేశించింది. గురువారం ఇక్కడ జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్స్ మ్యాచ్‌లో ఈ ఇండో, ఫ్రెంచ్ జోడీ.. 3-6, 6-4, 12-10తో బ్రిటన్ జంట జులియన్-లాయిడ్ గ్లాస్‌పూల్‌ను ఓడించింది.

## సెమీస్‌లో కార్తీక్ జోడీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: వరల్డ్ టూర్ ఐటీఎఫ్ టెన్నిస్ టోర్నీలో భారత జోడీ సాయి కార్తీక్‌రెడ్డి, విష్ణువర్ధన్ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్స్‌లో కార్తీక్, విష్ణు ద్వయం 6-4, 6-4తో ఎరిక్ వాన్మెల్బెయిమ్(ఉక్రెయిన్), లూకా కాస్టెనువో(స్విట్జర్లాండ్) జోడీపై గెలిచి ముందంజ వేసింది. ఆది నుంచే తమదైన దూకుడు ప్రదర్శించిన కార్తీక్ జంట వరుస సెట్లలో ప్రత్యర్థిని మట్టికరిపించింది.

# హ్యాట్రిక్ సిరీస్ వేటలో

**నేటి నుంచే భారత్, ఐర్లాండ్ వన్డే పోరు • మంధాన సారథ్యంలో బరిలోకి టీమ్‌ఇండియా • యువ బౌలర్లకు సదావకాశం**

రాజ్‌కోట్: గతేడాది ముగిసిన టీ20 ప్రపంచ కప్ తర్వాత స్వదేశంలో న్యూజిలాండ్, వెస్టిండీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లను గెలుచుకుని జోరు మీదున్న భారత మహిళల జట్టు మరో సమరానికి సిద్ధమైంది. శుక్రవారం నుంచి రాజ్‌కోట్ వేదికగా ఐర్లాండ్‌తో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా తొలి వన్డే జరుగనుంది. గత రెండు సిరీస్‌లను దక్కించుకుని జోరు మీదున్న టీమ్‌ఇండియా.. ఐర్లాండ్‌నూ చిత్తు చేసి హ్యాట్రిక్ సాధించాలని ఉవ్విళ్లూరుతోంది. ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి భారత్‌లో జరగాల్సి ఉన్న మహిళల వన్డే వరల్డ్‌కప్ జరుగనున్న నేపథ్యంలో జట్టులో చోటు ఆశిస్తున్న యువ క్రికెటర్లకు, తమ స్థానాన్ని పటిష్టం చేసుకునేందుకు సీనియర్లకు ఈ సిరీస్ సదావకాశం. భారత్‌తో తొలిసారి ద్వైపాక్షిక సిరీస్ ఆడుతున్న ఐర్లాండ్.. ఆతిథ్య జట్టుకు పోటీనిచ్చేందుకు సిద్ధమైంది.

మ్యాచ్‌లన్నీ రాజ్‌కోట్‌లోని సౌరాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో జరుగుతాయి.

ఉదయం 11 గంటల నుంచి స్పోర్ట్స్-18లో

### మంధాన.. జోరు సాగనీ..

ఈ సిరీస్‌లో రెగ్యులర్ సారథి హర్మన్‌ప్రీత్ కౌర్‌కు సెలక్టర్లు విశ్రాంతినిచ్చిన నేపథ్యంలో స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన జట్టును నడిపించనుంది. ఇటీవలి కాలంలో పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో ఆమె మంచి ఫామ్‌లో ఉంది. వరుసగా ఐదు అర్ధ శతకాలు సాధించిన ఆమె జోరు కొనసాగించాలని చూస్తోంది. షఫాలీ వర్మకు ఈ సిరీస్‌లోనూ చోటు దక్కని నేపథ్యంలో ప్రతీకతో కలిసి మంధాన ఇన్నింగ్స్‌ను ఆరంభించనుంది. టాపార్డర్‌లో హర్మన్‌ప్రీత్ లేకపోవడంతో మంధాన, ప్రతీకతో పాటు వెస్టిండీస్ సిరీస్‌లో తొలి శతకం సాధించిన హర్లీన్ డియోల్‌పై మరింత భారం పడనుంది. జెమీమా రోడ్రిగ్స్, వికెట్ కీపర్ బ్యాటర్ రీచా ఘోష్ కూడా తలా ఓ చేయి వేస్తే ఐర్లాండ్ బౌలర్లకు తిప్పలు తప్పవు.

### యువ బౌలర్లు సత్తా చాటేనా?

హర్మన్‌ప్రీత్‌తో పాటు సీనియర్ పేసర్ రేణుకా సింగ్ ఠాకూర్‌కూ విశ్రాంతినిచ్చిన నేపథ్యంలో పేస్ బాధ్యతలను యువ పేసర్లు టిటాస్ సాధు, సయిమా ఠాకూర్ మోయనున్నారు. విండీస్‌తో టీ20 సిరీస్‌లో 13 వికెట్లు పడగొట్టిన సాధు.. తన స్వింగ్, పేస్‌తో మరోసారి సత్తా చాటాలని భారత్ ఆశిస్తోంది. ఇప్పటిదాకా 8 వన్డేలాడి 7 వికెట్లు పడగొట్టిన సయిమా కూడా జట్టులో స్థానం సుస్థిరం చేసుకునేందుకు ఈ సిరీస్ చక్కని అవకాశం. వైస్ కెప్టెన్‌తో పాటు స్పిన్ బాధ్యతలను మోయనున్న దీప్తి శర్మకు ప్రియా మిశ్రా, తనూజా ఏ మేరకు అండగా నిలుస్తారనేది చూడాలి.

### పోటీనిచ్చేనా..

భారత్‌తో ఇంత వరకు జరిగిన 12 వన్డేలలో ఒక్కదాంట్లోనూ గెలవని ఐర్లాండ్.. ఈ సిరీస్‌లో అయినా మంధాన సేనకు గట్టి పోటీని వ్వాలని పట్టుదలతో ఉంది. కెప్టెన్ గాబీ లూయిస్, ఆల్‌రౌండర్ ఒర్లా ప్రెండర్‌గస్ట్, లీ పాల్, అర్లెనె కెల్లీ ఆ జట్టులో కీలకం. స్వదేశంలో పటిష్టంగా ఉండే భారత్‌ను ఐర్లాండ్ ఏ మేరకు ఎదుర్కుంటుందనేది ఆసక్తికరం.

# కౌంటీల్లో కోహ్లీ!

ఢిల్లీ: ఇటీవల పేలవ ఫామ్‌తో తీవ్ర విమర్శలు ఎదుర్కుంటున్న టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ దేశవాళీలో ఆడాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్న విషయం తెలిసిందే. సుమారు పదేండ్లుగా దేశవాళీ వైపు కన్నెత్తి చూడని కోహ్లీ.. ఈ ఏడాది ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు ముందు మాత్రం తన మనసు మార్చుకున్నట్టు తెలుస్తోంది. కానీ భారత్‌లో కాకుండా ఇంగ్లండ్ కౌంటీలలో ఆడాలని విరాట్ నిశ్చయించుకున్నట్టు సమాచారం. జూన్ 20 నుంచి మొదలుకాబోయే టెస్టు సిరీస్‌కు ముందు కోహ్లీ.. కౌంటీలు ఆడనున్నాడని తెలుస్తోంది. ఒకవేళ ఐపీఎల్-2025లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ప్లేఆఫ్స్‌కు వెళ్తే అతడు కనీసం రెండు వారాల పాటు అయినా కౌంటీలు ఆడతాడని, లీగ్ దశలోనే వెనుదిరిగితే సుమారు నెల రోజుల పాటు కౌంటీలకు కేటాయించనున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఒకవేళ కోహ్లీ గనక కౌంటీలలో ఆడితే ఇంగ్లండ్ పరిస్థితులకు అలవాటు పడేందుకు అవి అతడికి ఎంతగానో ఉపయోగపడతాయి.

# సారథులుగా ప్రతీక్, ప్రియాంక



ఢిల్లీ: ఢిల్లీ వేదికగా ఈనెల 13 నుంచి మొదలుకాబోయే ఖోఖో ప్రపంచకప్ తొలి ఎడిషన్‌కు భారత్ సారథులను ప్రకటించింది. పురుషుల జట్టుకు ప్రతీక్ వాయికర్, మహిళల జట్టుకు ప్రియాంక ఇంగ్లె కెప్టెన్లుగా వ్యవహరించనున్నారు. జనవరి 13 నుంచి 19వ తేదీ వరకు జరిగే ఈ టోర్నీలో భారత పురుషుల జట్టు నేపాల్‌తో, మహిళల జట్టు దక్షిణ కొరియాతో జరిగే మ్యాచ్‌లతో టైటిల్ వేటను ఆరంభించనున్నాయి.

## మంచుకొండ పాఠశాలను సందర్శించిన డీఈవో

రఘునాథపాలెం, జనవరి 9: మండలంలోని మంచుకొంగ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డీఈవో సోమశేఖర శర్మ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఇంగ్లిష్ బాషాభివృద్ధిపై పాఠశాలలో జరుగుతున్న కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. వారితో ఆంగ్లంలో మాట్లాడించారు. ఇతర సబ్జెక్టులను సైతం ఇంగ్లిష్‌లో బోధించారు. లాంగ్వేజీని ఎలా పెంపొందించుకోవాలో ఉపాధ్యాయులకు సూచించారు. ప్రత్యేక తరగతులను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. హెచ్ఎం ఆర్ కరుణకుమారి, ఉపాధ్యాయులు అంజం రాజు, నజీమ, శ్రీను, భానుమతి తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు సేవల ఫీడ్‌బ్యాక్ కోసం 'క్యూఆర్ కోడ్'

**పోస్టర్ల ఆవిష్కరణలో సీపీ సునీల్‌దత్**

మామిళ్లగూడెం, జనవరి 9: పోలీసుల పనితీరు, వారిపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలను తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వ పోలీసు శాఖ 'క్యూర్ కోడ్ ఆఫ్ సిటిజన్'ని రూపొందించిందని సీపీ సునీల్‌దత్ తెలిపారు. ఈ మేరకు ఆ క్యూఆర్ పోస్టర్లను సీపీ సునీల్‌దత్ గురువారం ఖమ్మంలోని తన కార్యాలయంలో ప్రారంభించారు. తొలుత డీజీపీ కార్యాలయం నుంచి సీపీలు, ఎస్పీలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో డీజీపీ డాక్టర్ జితేందర్ ఈ 'క్యూఆర్ కోడ్ ఆఫ్ సిటిజన్' పోస్టర్లను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఖమ్మంలో సీపీ మాట్లాడుతూ.. బాధితులు తమ సమస్యలను విన్నవించేందుకు పోలీస్ స్టేషన్లకు వెళ్లిన తరువాత పోలీసు సిబ్బంది వ్యవహరించిన తీరు, ఫిర్యాదులు, ఇతర సేవల గురించి ప్రజలకు ఏర్పడిన అభిప్రాయాలను తెలుసుకునేందుకే ఈ తమ శాఖ ఈ క్యూఆర్ కోడ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు. అన్ని పోలీసు కార్యాలయాల్లోనూ ఈ క్యూఆర్ కోడ్ అందుబాటులో ఉంటుందన్నారు. ఏడీసీపీలు నరేశ్‌కుమార్, ప్రసాదరావు, ట్రైనీ ఐపీఎస్ రుత్విక్‌సాయి పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయిలో ఖమ్మం విద్యార్థుల సత్తా

**ఇన్‌స్పైర్, సైన్స్‌ఫెయిర్ పోటీల్లో జాతీయస్థాయికి..**

రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన విద్యార్థులతో ఖమ్మం సైన్స్ విభాగ అధికారులు

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 9:రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్, సైన్స్‌ఫెయిర్ పోటీల్లో ఖమ్మం జిల్లా విద్యార్థులు సత్తాచాటారు. మహబూబ్‌నగర్‌లో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి ప్రదర్శనలో మొదటిస్థానాల్లో నిలిచారు. వీరి ప్రాజెక్టుల్లో ఒకటి జాతీయస్థాయికి, రెండు ప్రాజెక్టులు సౌతిండియా స్థాయికి ఎంపికైనట్లు జిల్లా సైన్స్ విభాగం అధికారులు గురువారం ప్రకటించారు. ఖమ్మంలోని రెజొనెన్స్‌శ్రీనగర్ పాఠశాల విద్యార్థిని సీహెచ్ అన్విత చేసిన ప్రాజెక్ట్ ఇన్‌స్పైర్ విభాగంలో జాతీయస్థాయికి ఎంపికైంది. సైన్స్ ఫెయిర్‌లో బురదరాఘవాపురం పాఠశాలకు చెందిన విద్యార్థిని మహిమ చేసిన ప్రాజెక్టు, ఎస్ఎఫ్ఎస్ పాఠశాల విద్యార్థి సత్యసాయి వివేకానంద చేసిన ప్రాజెక్టు సౌతిండియా స్థాయికి ఎంపికయ్యాయి. బ్లోసమ్స్ హైస్కూల్ విద్యార్థిని ఉషాశ్రీ ప్రాజెక్టు వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో ప్రథమస్థానం, వివాన్ స్కూల్ విద్యార్థుల ప్రాజెక్టు న్యాచురల్ ఫామింగ్ ద్వితీయస్థానం సాధించాయి. స్టేట్ లెవల్ సెమినార్‌లో త్రివేణి స్కూల్ విద్యార్థిని హరిచందన రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. కాగా, ప్రతిభ కనబర్చిన విద్యార్థులను డీఈవో సోమశేఖరశర్మ, డీఎస్‌వో జగదీశ్, వెంకటేశ్వర్లు తదితరులు అభినందించారు.

## నేటి నుంచి ఆరు రోజులు మార్కెట్‌కు సెలవులు

ఖమ్మం వ్యవసాయం, జనవరి 9: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు ఈ నెల10 నుంచి 15 వరకు వరుసగా క్రయవిక్రయాలకు సెలవులు ఉంటాయని మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా వర్తక సంఘం వ్యాపారుల కోరిక మేరకు శుక్రవారం సెలవు ప్రకటించినట్లు చెప్పారు. శని, ఆదివారాలు వారాంతపు సెలవులు ఉంటాయన్నారు. అలాగే, సోమవారం బోగి, మంగళవారం సంక్రాంతి, బుధవారం కనుమ సందర్భంగా సెలవులు ప్రకటించినట్లు వివరించారు. తిరిగి ఈ నెల 16న గురువారం నుంచి క్రయవిక్రయాలు యథావిధిగా జరుగుతాయన్నారు. రైతులు ఈ విషయాన్ని గ్రహించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# కార్మికుల క్లబ్‌పై శీతకన్ను

- కనీసం తాగునీరు సౌకర్యం లేకపాయే..
- శుభకార్యం చేసుకోవాలంటే ఇబ్బందులు
- అధికారుల క్లబ్‌కేమో హంగులు
- 'ఒకే కుటుంబం' నినాదమే.. ఆచరణ నిల్
- వసతులు కల్పించాలని కోరుతున్న సింగరేణి కార్మికులు

**పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నచందంలా ఉంది సింగరేణి కార్మికుల క్లబ్ పరిస్థితి. సింగరేణి ఏరియాలో పనిచేసే కార్మికుల కుటుంబాలు శుభకార్యాలు చేసుకునేందుకు ఏర్పాటు చేసిన రిక్రియేషన్ క్లబ్ కనీస సౌకర్యాలు లేక వెలవెలబోతున్నది. కార్మికులు, అధికారులు సమానమే అంటూ ప్రచారం చేసుకుంటున్న సింగరేణి సంస్థ ఆచరణలో మాత్రం పాటించడం లేదు. అధికారులు, కార్మికులను వేర్వేరుగా చూస్తూ కార్మికుల క్లబ్‌పై శీతకన్ను వేసింది. దీంతో కార్మికులు ఏ కార్యక్రమాలు చేసుకోవాలన్నా జేబులు ఖాళీ చేసుకునే పరిస్థితి దాపురించింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిపెట్టి అధికారుల క్లబ్ వలే తమ క్లబ్‌లో కూడా అన్ని సౌకర్యాలు కల్పించాలని కార్మికులు ముక్తకంఠంతో కోరుతున్నారు. - రామవరం, జనవరి 9**

కొత్తగూడెం ఏరియాలోని రుద్రంపూర్ సీఈఆర్ క్లబ్(కోల్‌మైన్స్ ఎంప్లాయీస్ రిక్రియేషన్ క్లబ్) ప్రాంతంలో అధికారుల కోసం ఆర్‌సీవోఏ క్లబ్, కార్మికుల కోసం సీఈఆర్ క్లబ్ ఏర్పాటు చేశారు. ఏరియాలో పనిచేస్తున్న ఎన్‌సీడబ్ల్యూఏ(నేషనల్ కోల్‌వేజ్ అగ్రిమెంట్) ఉద్యోగుల నుంచి క్లబ్ సభ్యత్వం కోసం ప్రతినెలా ఒక్కొక్కరి జీతం నుంచి రూ.10 చొప్పున రికవరీ చేస్తుంటారు. ఉద్యోగుల కుటుంబాల్లో ఏదైనా శుభకార్యం నిర్వహించుకోవాలంటే ఈ ప్రాంతంలో ఉన్న కమ్యూనిటీ హాల్‌తోపాటు ఈ క్లబ్‌లే శరణ్యం. అధికారులు, కార్మికుల రెండు క్లబ్‌లు దగ్గరలోనే ఉన్నా వాటి నిర్వహణలో మాత్రం చాలా వ్యత్యాసం ఉంది. అధికారుల క్లబ్‌కి అన్ని హంగులు ఉంటే.. కార్మికుల క్లబ్‌లో కనీస వసతులు కూడా లేవు. డైనింగ్ హాల్, వంటగది, ముఖ్యంగా నీటి సౌకర్యం లేదు. దీంతో మరుగుదొడ్ల వాసనతో ఇబ్బంది పడతారు. వంటలు చేసుకునేందుకు కావాల్సిన నీటిని ఆర్‌సీవోఏ క్లబ్ మరుగుదొడ్లకు ఉపయోగించే ట్యాంకు నుంచి నీటిని వాడుకుంటూ ఉంటారు. లేదంటే ట్యాంకర్ తెచ్చుకుంటే తప్ప శుభకార్యం చేసుకునే పరిస్థితి ఉండదు.

పంచాయతీ ట్యాంకర్‌తో నీళ్లు సరఫరా చేసుకొని వాడుతున్న దృశ్యం (ఫైల్)

### అధికారులకో న్యాయం.. కార్మికులకో న్యాయం?

అధికారుల ఆర్‌సీవోఏ క్లబ్ మెయింటెనెన్స్ కోసం సింగరేణి ఉద్యోగిని నియమించుకున్నారు. క్లీనింగ్, గార్డెన్ పనుల కోసం సిబ్బందిని నియమించుకున్నారు. సీఈఆర్ క్లబ్ నిర్వహణకు మాత్రం కనీసం డీఎల్ఆర్ ఉద్యోగిని నియమించకపోగా.. విశ్రాంత ఉద్యోగిని నియమించారు. ఆహ్లాదం కోసం క్లబ్‌లో కనీసం దినపత్రికలు, క్యారమ్స్, చెస్, బ్యాడ్మింటన్ ఆటలు ఆడుకునేందుకు అవకాశం ఉన్నప్పటికీ అక్కడ అలాంటివి ఏవీ కనిపించవు. దీంతో కార్మికులు అటువైపు వెళ్లడమే మర్చిపోయారు. శుభకార్యాలు జరిగితే తప్ప క్లబ్ తెరిచిన పాపానపోరు.

### ఎలాంటి వసతులూ లేవు..

కార్మికుల క్లబ్‌లో శుభకార్యాలు చేసుకోవాలంటే ఎలాంటి వసతులు ఉండవు. వంటషెడ్డు లేకపోవడంతో క్లబ్ ముందే వంట చేసుకోవడంతో బురదగా మారుతోంది. నీటి సౌకర్యం అస్సలుండదు. ట్యాంకర్ తెచ్చుకుంటే తప్ప ఫంక్షన్ చేయలేం. బోరు వేసి నీటి సౌకర్యాన్ని కల్పించాలి. అధికారులు పరిశీలిస్తున్నారే తప్ప కార్మికులకు మాత్రం ప్రయోజనం జరగడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి క్లబ్‌ను రోజూ తెరిచే విధంగా చర్యలు తీసుకోవాలి.

**– నిమ్మల రాజేశ్వరరావు, సింగరేణి ఉద్యోగి, కొత్తగూడెం ఏరియా**

### వెల్ఫేర్ ఫండ్ వాడుకోవచ్చు..

అధికారుల క్లబ్, కార్మికుల క్లబ్ రెండూ పక్కపక్కనే ఉంటాయి. అక్కడ సకల సౌకర్యాలు ఉంటాయి... కానీ ఇక్కడ చిన్న చిన్న వసతులు కూడా ఉండవు. ఫంక్షన్లు చేసుకోవాలంటే నీటి వసతి లేదు. వంట షెడ్డు అసలే లేదు. డైనింగ్ హాల్ కూడా లేదు. గతంలో గుర్తింపు సంఘంగా టీబీజీకేఎస్ ఉన్నప్పుడు అనేకమార్లు క్లబ్ బాగుపర్చాలని యూనియన్ కొట్లాడడంతో టైల్స్, సీలింగ్, ఇతర పనులు చేసి చేతులు దులుపుకున్నారు. ఇప్పుడు సరైన నిర్వహణ లేకపోవడంతో మరుగుదొడ్లు వాడే పరిస్థితి లేకుండాపోయింది. ఈ క్లబ్‌లో జిమ్, ఆడుకోవడానికి షటిల్ కోర్టు, క్యారమ్స్ ఏవీ లేనప్పుడు ఇది రీక్రియేషన్ క్లబ్ ఎలా అవుతుంది. ఇప్పటికైనా అధికారులు సింగరేణి ఒకే గమ్యం, ఒకే లక్ష్యం, ఒకే కుటుంబం అనే నినాదాన్ని మాటల్లో కాకుండా చేతల్లో కూడా చేసి చూపించాలి. క్లబ్‌పై ప్రత్యేక దృష్టి సారించి వసతులు కల్పించాలని కోరుతున్నాం. ఉన్నతాధికారులు స్పందించకపోతే పోరాటం చేస్తాం.

**– రాసూరి శంకర్, టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ మెంబర్**

# 'అప్‌గ్రేడ్' అంతేనా..?

**గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పరిపాలనా అనుమతులు**
**అమలులో నిర్లక్ష్యం చేస్తున్న ప్రస్తుత రేవంత్‌రెడ్డి సర్కారు**
**సాకారం కాని వంద పడకల ఆసుపత్రి స్థాయి**
**అత్యవసర వైద్య సేవల కోసం అవస్థ పడుతున్న రోగులు**
**సర్కారు నిర్లక్ష్య ధోరణిపై మండిపడుతున్న మండల ప్రజలు**

అశ్వారావుపేట, జనవరి 9 : అత్యవసర వైద్యం అందని ద్రాక్షలా మారింది. పదేళ్ల పాలనలో కేసీఆర్ ప్రభుత్వం వైద్యాభివృద్ధికి పెద్దపీట వేయగా.. ఏడాది పాలనలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వైద్య సేవల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన జీవోను కూడా అమలు చేయకుండా నాన్చివేత ధోరణి అలంబిస్తున్నది. దీంతో మండల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందక అవస్థలు పడుతున్నారు. ఆర్థిక భారంతో సుదూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొన్నది. అశ్వారావుపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ) ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ అయ్యి ఏడాదిన్నర గడుస్తున్నది. అయితే రోగులకు పూర్తిస్థాయి వైద్య సేవలు అందించడంలో విఫలమవుతున్నది. 2023లో అప్పటి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు 100 పడకల ఆసుపత్రిగా ఆనాటి సీఎం కేసీఆర్‌ను ఒప్పించి అప్‌గ్రేడ్ చేయించారు. 2023, ఆగస్టు 8న 100 పడకల ఆసుపత్రికి పరిపాలనా అనుమతులు ఇస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. అయితే అప్‌గ్రేడ్ కేవలం జీవోకే పరిమితమైంది. అదే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగడంతో భవన నిర్మాణాలు, వైద్యులు, సిబ్బంది పోస్టుల మంజూరు విషయంలో అడుగు ముందుకు పడలేదు.

కేసీఆర్ ప్రభుత్వంలో ఏర్పాటైన డయాలసిస్ సెంటర్

### గత కేసీఆర్ ప్రభుత్వంలోనే ఆధునీకరణ..

సీహెచ్‌సీగా ఉన్నప్పుడే ప్రభుత్వ ఆసుపత్రిలో గత కేసీఆర్ ప్రభుత్వం రోగులకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తెచ్చింది. అప్పటివరకు అరకొరగా ఉన్న సర్కార్ వైద్యంపై కేసీఆర్ ప్రజల్లో నమ్మకం కల్పించారు. ముఖ్యంగా మండుల కొరత లేకుండా చర్యలు చేపట్టారు. ల్